# వేయి కనులతో వేచిన రాధ



"సార్, చిన్న రిక్వెస్టు..."

వేణూ తలెత్తి చూసాడు. రోజూ పక్కబెంచీ మీద కూచునే అమ్మాయి.

"...నేను, జస్ట్ ఫోన్‌చేసి... ఇప్పుడే పది నిమిషాల్లో వచ్చేస్తాను. నా కోసం ఎవరైనా వస్తే కాస్త ఆగమని చెబుతారా?"

సరేనన్నట్టు తలవూపాడు వేణు. ఆ అమ్మాయి వెళ్లిపోయాక గుర్తొచ్చింది అతనికి, ఎవరైనా ఆ అమ్మాయి కోసం వచ్చేరని ఎలా తెలుస్తుంది? ఈ అమ్మాయి పేరు తెలియదు. వచ్చేవాళ్లు ఎలా ఉంటారో ఈమె చెప్పలేదు. తను మాత్రం ఊపేసాడు ఇవేమీ ఆలోచించకుండా.

అదృష్టవశాత్తూ ఎవరూ రాలేదు. అసలు పార్కులో ఈ మూలకు సాధారణంగా ఎవరూ రారు. ఈ మూల బెంచీల్లో పనీపాటా లేనివాళ్లూ, బూతుపుస్తకాలు చదువుకునే వాళ్లూ ఆక్రమించుకుని ఉండేవాళ్లు. సునీత ధర్మమాని తను ప్రతీ బుధవారం వచ్చి ఇక్కడ కాపేయడంతో వాళ్లూ

రావడం మానేసారు.

ఆ అమ్మాయి తిరిగి వచ్చేసింది. "ఎవరైనా వచ్చారాండి?" అని అడిగింది. లేదని తల తిప్పితే నిరాశగా చూసి తన బెంచీ మీద కూలబడింది. ఆమెదీ తన కేసేనేమో, ఆమె ప్రియుడూ సునీతలాటి వాడేనేమో.

సునీత అన్న టైముకి ఎప్పుడూ రాదు. కనీసం గంటన్నరైనా ఆలస్యం చేస్తుంది. ప్రతీసారీ ఏదో ఒక పురాణం చెబుతుంది. 'యాడ్ ఏజన్సీలో ఎగ్జిక్యూటివ్‌ని కదా, ఎవరో ఒకరు వస్తూంటారు. మన ఐడియా వాళ్లకి నచ్చచెప్పి పంపించేసరికి ఈ టైమవుతుంది.' అంటుంది. 'కలిసేది వారాని కొకసారి కదా. ఆ రోజు తీరిక చేసుకోరాదా?' అంటే 'నీ కివన్నీ అర్థం కావులే. నలుగురితో మసలినప్పుడే ఈ ప్రాబ్లెమ్స్ తెలుస్తాయి. నీలాగ, 'నన్ను ముట్టుకోకు నామాలకాకి'లా ఉన్నవాడికి ఇలాటి సమస్యలు రానేరావు' అని వెక్కిరిస్తుంది.

'నిజమే, నేను ఇంట్రోవర్ట్‌నే. సునీతతో స్నేహం కలవడానికి కూడా ఆమె ప్రోద్బలమే కారణం. లేకపోతే నేను ధైర్యం చేసి అమ్మాయిలతో మాట్లాడడమే! అసాధ్యం' అనుకున్నాడు వేణు. 'నన్ను ముట్టుకోకు..' అని సునీత వేళాకోళం చేయడానికి కూడా కారణం ఉంది. సునీత చనువిచ్చినా, వేణూ తీసుకోలేదు. ప్రతీ బుధవారం వాళ్లకి మీటింగ్ పాయింటు ఆ పార్క్ బెంచీ. సునీత రాగానే ఇద్దరూ కలిసి, ఏ హోటల్‌కో, సినిమాకో వెళ్లేవారు. పెళ్లయ్యేదాకా హద్దుల్లో ఉండాలనేది వేణూ సిద్ధాంతం.

వచ్చేవారం ఆ అమ్మాయి మళ్లీ కనబడింది వేణూకి. చూసి పలకరించలేదు. 'పలకరిస్తే తన వివరాలు చెప్పవలసి వస్తుందన్న భయమేమో. ఆ మాటకొస్తే ఆ భయం తనకూ ఉంది. పోన్లే ఆ అమ్మాయి పరిచయం కాకపోవడమే మంచిది. పరిచయస్తులని తేరిపార చూడలేం. మర్యాద లేదనుకుంటారని భయం. అపరిచితురాలు కాబట్టి ఆమె ఒంపుసొంపులు తనివితీరా చూడవచ్చు. తన అదృష్టం కొద్దీ ఆమె కూచున్న తీరు తనకు అనువుగా ఉంది. సునీత వచ్చేవరకూ మంచి కాలక్షేపమే.' అనుకున్నాడు వేణూ.

పోను, పోను ప్రతీవారం వేణూకి ఇదొక అలవాటుగా మారింది. ఆ అమ్మాయికి కూడా ప్రతీ బుధవారం కలిసే అగ్రిమెంటేనేమో. సునీత ఆలస్యం చేస్తున్నా, ఇప్పుడతను మరీ బాధపడటం లేదు. ఆ వెయిట్ చేసే అమ్మాయి మొదట్లో పెద్ద అందంగా కనబడలేదు కానీ, చూడగా, చూడగా ఆమెలో కూడా ఒక ఆకర్షణ ఉన్నట్టు అనిపించింది. ముఖ్యంగా పక్కనుంచి చూసినప్పుడు ఆమె వక్షం, నడుం దగ్గర మడతలు, పలుచని నాభీదేశం, ఒంగి పుస్తకం చదువుకునేటప్పుడు కొద్దిగా పైకి లేచే జఘనం.. అతనికి మత్తెక్కించసాగాయి. ఒకటి రెండుసార్లు ఆమె ఆలస్యంగా వచ్చేసరికి వేణూ కొట్టుకుపోయాడు, ఏమయిపోయిందాని.

ఇంత అందమైన అమ్మాయి ప్రియుడెలా ఉంటాడో చూడాలన్న ఆలోచన వచ్చిందతనికి. 'చిత్రం, అతను ఎప్పుడూ కనబడలేదు. సునీతా, తనూ వెళ్లిపోయాక వస్తాడు కాబోలు. అంటే తనకంటే ఎక్కువ వెయిటింగన్నమాట. పాపం ఈ అమ్మాయి కూడా తనలాగానే చొరవ తక్కువేమో. అందుకనే ఆమె ప్రియుడు కూడా ఇలా ఆటలాడిస్తున్నాడు. ఫలానా టైముకి వద్దామని అనుకున్నాక, రావాలా? అక్కర్లేదా? వచ్చేక ఎక్కడికి పోతుందిలే అన్న ధైర్యమేమో. అయినా ప్రేమ నిశ్చలంగా ఉంది. తనలాగే. ప్రేమించినవాడి పట్ల ఆమె శ్రద్ధ, ఎంతసేపైనా సరే కాచుకునే ఓర్పు, ఎంతో ముచ్చట గొలుపుతున్నాయి. ఆమె ప్రియుడు ఎంత గొప్పవాడైనా కానీ, ఈమె ప్రేమకు తగడు. తన ప్రేమకు సునీత తగనట్లే. ఆ నిర్లక్ష్యం చూడు.'

ఓ బుధవారం సునీత రెండుగంటలైనా రాలేదు. వేణూకి కోపం వచ్చేసింది. బుక్ చేసిన సినిమా టిక్కెట్లు వృథా అవుతున్నాయన్న ఉక్రోషం వచ్చింది. వెళ్లి ఆ అమ్మాయిని అడిగాడు, 'మీరు వస్తారా?' అని. ఆమె కూడా తన ప్రియుడితో విసిగిపోయింది కాబోలు. వెంటనే ఒప్పేసుకుంది.

మూణ్నెళ్లలో కథ చాలా దూరం పోయింది. సునీతతో సంబంధం తెంపుకుని, వేణూ రాధ, అదే

ఆ వెయిటింగ్ లేడీను పెళ్లాడ్డం జరిగిపోయాయి. రిసెప్షన్ రోజు రాత్రి రాధను అక్కున చేర్చుకుంటూ వేణూ సరదాగా అన్నాడు. "సాధారణంగా హిందీ సినిమాల్లో చూపిస్తాడు చూడు. హీరో తన ప్రియురాలి పెళ్లి రిసెప్షన్‌కి వచ్చి పియానో మీద పాట పాడేస్తాడు. అలా ఇవాళ మీ సుధీర్ వస్తాడనుకున్నాను, నేనే పలకరించి ఇలాటి అమ్మాయిని నాకు వదిలేసినందుకు థాంక్స్ చెబుదామనుకున్నాను."

"అసలు సుధీర్ అనే వ్యక్తి ఉంటేగా, రావడానికీ, మీరు కలవడానికీ..."

వేణూ తెల్లమొహం వేయడం చూసి రాధ విశదీకరించాల్సి వచ్చింది. "మా ట్యూషన్‌కి వెళ్లే దారే అది. మీరు ప్రతీ బుధవారం అక్కడ కూచోడం, చాలాసేపు పోయాక ఒక అమ్మాయి బేగ్ ఊపుకుంటూ రావడం, మీరు మొహం మాడ్చుకుంటూ వెంట వెళ్లడం చూసాను. మీరు నాకు నచ్చారు. కానీ అలా అని మొహం మీద చెప్పలేను కదా. అందుకని ఎవరి గురించో వెయిట్ చేస్తున్నట్టు మీ ముందు గంటల తరబడి కూచునేదాన్ని... ఎప్పటికైనా మీ చల్లని చూపు పడకపోతుందాని. మొగాళ్లు రంగు చూసి, మొహం చూసి మోహపడతారు కానీ మిగతా అందాలు పట్టించుకోరుగా. అందుకే ఫోన్ మిష పెట్టి ఓ సారి పలకరించాను. చివరికి నా అదృష్టం బాగుండి.." అంటూ అతని శరీరాన్ని కౌగలించుకుంది.

వేణూ ఆశ్చర్యపడ్డాడు. కాస్సేపటికి తనూ నిజం చెప్పేస్తే గుండెభారం తీరిపోతుందనిపించింది. "నిజం చెప్పాలంటే, మొదట్లో నువ్వు నా కంటికి ఆనలేదు. కానీ నువ్వు కాస్త దూరంగా బెంచీ మీద పుస్తకం చదువుకునేదానివి చూడు, ఆ కూచోడం పోజులో, ఆ ఏంగిల్లో.."

"వర్ణించక్కర్లేదు లెండి. ఎలా కూచుంటే ఏమేం కనబడతాయో గంటలతరబడి ప్రాక్టీసు చేసిన తర్వాతనే కూచునేదాన్ని... నాకు తెలియదా మీ చూపులు ఎక్కడ పాకేవో.." అంటూ అతని పెదాలు మూసేసింది, తన పెదాలతో!

●

(ఆంధ్రప్రభ వీక్లీ జూన్ 1998)